క్లుప్తంగా

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

గోనెగండ్ల: ఈనెల 20 నుంచి 25 తేదీ వరకు ఒంగోలులో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మద్దిలేటి నాయుడు, తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు మాలిక్ బాషా, మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శులు శ్రీరాములు, శివ రామాంజిని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరేష్, నరసింహుడు, బొబ్బిలి, బేతాళ పెద్ద బాషు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ మీట్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధరణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు ఆదివారం తెలిపారు. కౌన్సిల్ సభ్యులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సబ్‌జైల్ వార్డెన్ నరసప్పను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోని రూరల్: ఆదోని సబ్‌జైల్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న నరసప్ప ఈనెల 15వ తేదీన కర్నూలులో మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ చేతులమీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని అరుణ్‌జ్యోతినగర్ 8వ వార్డు ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ మైత్రి కాంతరాజ్ ఆధ్వర్యంలో అరుణ్‌జ్యోతి నగర్‌లోని నోబుల్ ఒకేషనల్ కళాశాలలో సన్మానసభ ఏర్పాటు చేశారు. నరసప్పకు దుశ్శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, నోబుల్ ఒకేషనల్ కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం, నాయకులు హనుమంతు, బాలస్వామి, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమ పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ఉన్న పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనాథ బాలుర ఆశ్రమాన్ని ఆదివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. అనాథ ఆశ్రమంలో అందిస్తున్న సేవల గురించి నిర్వాహకులు సింగనేటి నరసన్న, ప్రతిభ భారతిని అడిగి తెలుసుకొని అభినందించారు. కాగా ఆశ్రమానికి స్థలం కేటాయించాలని ఈసందర్భంగా వారు ఎమ్మెల్యేను కోరారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక ఎస్ఎన్ఎస్ జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థి మహమ్మద్ వలికి ఆదివారం మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల విజయవాడ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 72 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో ప్రతిభ చాటి జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. విద్యార్థిని ఆయనతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేష్, బసవరాజు, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధనకై పోరాడుదాం

ఆదోని అర్బన్: వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధనకై పోరాడుదామని ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, మాజీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గుడిసె ఆదికృష్ణమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని స్థానిక జేబీ గార్డెన్‌లో ఆదివారం వాల్మీకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ హక్కుల సాధనకై ఏ స్థాయిలోనైనా పోరాటం చేస్తామన్నారు. అందరం కలిసికట్టుగా ముందుకెళ్దామన్నారు.

పోతులింగేశ్వరుడికి జలాభిషేకం

హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి గ్రామంలో వెలసిన పోతులింగేశ్వరస్వామికి శ్రావణమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా గ్రామస్తులు తుంగభద్ర నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. దాదాపు 30 కి.మీ దూరంలోని కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప తాలూకా కెంచనగుడ్డ వద్ద ప్రవహించే తుంగభద్రా నదికి వెళ్లి అక్కడున్న 101 శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ నుంచి గంగాజలం నిండిన కుంభాన్ని, పల్లకీని కాలినడకతో గ్రామానికి తీసుకొచ్చి స్వామికి అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు.

దోమల విజృంభణ

- వర్షాలకు ఖాళీ స్థలాల్లో నిలుస్తున్న నీరు
- డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగునీరు
- వృద్ధి చెందుతున్న దోమలు
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- దోమల వృద్ధిని నివారించలేకపోతున్న మున్సిపల్ అధికారులు



పట్టణంలోని మురుగుకాలువాలో పేరుకొని పోయిన మురుగు,చెత్త చెదారం



పట్టణంలో పందుల సంచారం

ఎమ్మిగనూరుటౌన్: తుపాను ప్రభావంతో వరుసగా వర్షాలు కురుస్తుండటంతో పట్టణంలో ఖాళీస్థలాల్లో మురుగు నీరు నిలిచిపోతుండటం, మురుగునీటి కాలువల్లో పేరుకుపోతున్న చెత్తచెదారం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇవి జనాలపై దండెత్తుతుండటంతో జ్వరాలు, వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. పట్టణంలో సాయంత్రం అయితే చాలు దోమలు వీరవిహారం చేస్తున్నాయని పట్టణంతో పాటు శివారు మురికి వాడల్లోని ప్రజలు వాపోతున్నారు. దోమలు వృద్ధి చెంది వాటి బెడద రోజు రోజుకు పెరుగుతున్న నివారణ చర్యలు మాత్రం ప్రారంభించలేదు.

పారిశుద్ధ్యం అధ్వానం

కొన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా వుంటుండంతో దోమల వృద్ధికి కారణమతున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండటంతో పట్టణ వాసులు చికిత్సల కోసం ఆస్పత్రుల దారి పడుతున్నారు. కొద్ది రోజుల నుంచి పట్టణంలో జ్వర బాధితుల కేసులు కూడా పెరిగుతున్నాయని వైద్య సిబ్బంది చెబుతున్నారు. రోగులు ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా ప్రైవేట్ ల్యాబ్‌లలో ఆయా పరీక్షలు చేయించుకొని వైద్య చికిత్సలు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. శివారుప్రాంతాల్లో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

తప్పని పందుల బెడద

సీజనల్ వ్యాధుల్లో మెదడు వాపు వ్యాధి ఒకటి. అయితే ఇందుకు కారణమైన పందుల బెడద పెరుగుతుండటంతో మున్సిపల్ అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేకపోతున్నారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాలను ఎంచుకొని పెంపకందారులు పందులను యథేచ్ఛగా పెంచుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. సీజనల్ వ్యాధులు పెరగకముందే అధికారులు పందులను పట్టణానికి దూరంగా తరలించడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



వర్షాలు కురుస్తుండటంతో వర్షపు నీరు నిలిచిపోతూ, మురుగు కాలువల ద్వారా దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమలను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు ఫాగింగ్ చర్యలు చేపట్టాలి. మలేరియా లాంటి జ్వరాలు విజృంభించకముందే దోమలు, పందులను అరికట్టి, వ్యాధులను నియంత్రించి పట్టణ వాసుల ఆరోగ్యాన్ని కాపాడాలి.

– గోవిందు, ఎమ్మిగనూరు

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో దోమల నివారణ చర్యలు తీసుకుంటాం. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేపడతాం. మురుగు కాలువాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. పట్టణ వాసులు పారిశుద్ధ్యానికి సహకరించాలి.

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



మండల వ్యవసాయ అధికారి బి.వి.జి. సుధాకర్

ఆదోని రూరల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.వి.జి. సుధాకర్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పొలాల్లో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా కాలువల ద్వారా బయటకు పంపాలన్నారు. అధిక వర్షాల వల్ల నేలలోని పోషకాలు లీచింగ్ అయ్యి లోపాలు ఏర్పడతాయన్నారు. దీనికోసం రైతులు పొటాషియం నైట్రేట్ 20 గ్రాము లీటర్‌కు లేదా 19:19:19 (10 గ్రా./లీ.) లేదా మల్టీకే 13-0-45 (20గ్రా./లీ.) ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. యూరియా అధికంగా వాడితే తెల్లదోమ, రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగుతుందన్నారు. పంట త్వరగా కోలుకోవడానికి నానో డీఏపీ ఎకరానికి 500 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలన్నారు. లీచింగ్ వల్ల నైట్రోజన్ లోపాన్ని సరి చేయడానికి నానో యూరియా ఎకరానికి 500 మి.లీ. చొప్పున పిచికారీ చేయలన్నారు. రసం పీల్చే పురుగుల నియంత్రణకు, పచ్చదోమ, పేనుబంక, తామర పురుగుల నియంత్రణ కోసం ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా డెలిగేట్ 1 మి.లీ. లేదా డైనోటెఫ్యూరాన్ 0.3 గ్రాములు లీటర్ నీటికి కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. ప్రతి ఎకరానికి పది నీలం రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తెల్లదోమ నియంత్రణకు ప్రతి ఎకరానికి 10–15 పసుపురంగు జిగురు అట్టలు పెట్టాలన్నారు. ఉధృతి ఎక్కువైతే డైఫెనోథియురాన్ 1.25 గ్రా లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లీటర్ నీటికి కలుపుకుని పిచికారీ చేసుకోవాలని సూచించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహ నిర్మాణాలు చేపట్టి ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో ఆసంఘ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో ఏపీయూడబ్ల్యూజే జెండాను సీనియర్ పాత్రికేయుడు బజారప్ప ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలు ఫాతిమాతో కలిసి ఏపీయూడబ్ల్యూజే నాయకులు రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని నాయరా పెట్రోల్ బంక్ సమీపంలో ఏపీయూడబ్ల్యూజే సంఘం 69వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఏపీయూడబ్ల్యూజే సంఘం గౌరవ అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు మధు, కిరణ్ కుమార్‌లు జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ పత్రికల పాత్రికేయులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



భవన నిర్మాణ కార్మికుల మహా ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సత్వరం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బాలరాజు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మంగళవారం విజయవాడలో భవన నిర్మాణ కార్మికుల సంఘం, భారత కార్మిక సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్లను ఆదివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల 35 లక్షల కుటుంబాలు సుమారుగా 40 రకాల నిర్మాణ పనుల్లో పని చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి పనులు సక్రమంగా దొరక్క ఆయా కార్మికులు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. సర్క్యులర్ 1214 ను సత్వరం ప్రభుత్వం రద్దు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డ్‌ను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు బాబు, రాకేష్, చరణ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మేఘమాల పుస్తకావిష్కరణ



విజయవాడలో పుస్తకావిష్కరణ గావిస్తున్న ప్రముఖులు

నందవరం : మండలంలోని నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బాల సాహిత్యవేత్త, బాలబంధు డాక్టర్ గద్వాల సోమన్న రచించిన 76వ పుస్తకం 'మేఘమాల' ఆవిష్కరణ ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్(ఐఎంఏ), గవర్నర్ పేట, విజయవాడలో ఘనంగా జరిగింది. విశ్వసాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని పురస్కరించుకుని, ఆ సంస్థ అధ్యక్షురాలు కొల్లి రమావతి, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, ప్రముఖ సాహితీవేత్త, ప్రపంచ తెలుగు రచయితల సంఘం డా.గుమ్మా సాంబశివరావు, గుర్రం జాషువా కళాపరిషత్ అధ్యక్షులు పెద్దిటి డా. యోహాను, పద్యకవి అయినాల మల్లేశ్వర రావు చేతుల మీదుగా పుస్తకావిస్కరణ గావించారు. అనంతరం ఈ పుస్తకాన్ని విశ్రాతం ఉపాధ్యాయులు తిరువాయిపేట శ్రీనివాసులు దంపతులకు అంకితమిచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. 1991–1992 విద్యా సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అందరు 33 సంవత్సరాలు తర్వాత కలుసుకోవడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు శ్రీను, హరి, ప్రకాష్, కృష్ణ, విజయ్, సత్య, అమర్ ప్రకాష్ తెలిపారు. ఒకరి యోగ క్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రామకృష్ణ, సునీల్, వర్మలను సన్మానించారు.

పాఠశాలను మరువరాదు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ

ఆలూరు: కన్నతల్లిని, విద్యాబుద్ధులను నేర్పిన ఉపాధ్యాయులు, పాఠశాలను ఎన్నటికీ మరువరాదని డీఈఓ శ్యామ్యూల్‌పాల్ అన్నారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రభుత్వ బాలుర- 1, బాలుర- 2 జెడ్పీ హైస్కూల్లో 2000–2001లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. పేద విద్యార్థులకు చేయూతనందించడం బాధ్యతగా భావించాలని కోరారు. ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, రుణ్మికిబాయ్, పవన్‌కుమార్, ఆదోని ఎంఈఓ 2 భూపాల్‌రెడ్డి డీఈఓను సన్మానించారు. అనంతరం పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు.



జాయింట్ వీల్‌లో పిల్లల, పెద్దల విన్యాసాలు



బోట్స్‌లో విహారం

ఉరుకుందలో ఉల్లాసం.. ఆహ్లాదం!

కౌతాళం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలు అంటేనే పిల్లలకు ముందుగా గుర్తొచ్చేది ఆటవస్తువులు, అంగళ్లు. ఇక్కడ నెల రోజులు ఉత్సవాలు ఉండటంతో మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు విజయవాడ వంటి ప్రాంతాల నుంచి పిల్లలకు ఆడుకోవడానికి బ్రెక్‌డ్యాన్స్‌లతో పాటు వివిధ రకాల ఆటల విడిదిలను ఏర్పాటు చేయడంతో భక్తులు ఉల్లాసంగా గడుపుతున్నారు. ట్రైన్, వీల్ చైర్స్, జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, షిప్పింగ్ బోట్స్‌లు, కార్ రేసింగ్ వంటి వాటిని ఏర్పాటు చేయడంతో ఉరుకుందలోని బస్టాండు ప్రాంతం అంతా ఆహ్లాదకరంగా మారింది. అలాగే భక్తులు మిఠాయి అంగళ్లు, గాజుల అంగళ్ల సముదాయంలో బిజీబిజీగా ఉంటున్నారు.



ఆకాశమే హద్దుగా జాయింట్ వీల్



బ్రేక్ డ్యాన్స్‌లో చిన్నారులు

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



ఆస్పరి మఠంలో భక్తులకు అన్నదానం

హొళగుంద: దేవరగట్టులో శ్రావణమాసం నాలుగో ఆదివారం సందర్భంగా మాళమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో మూల విరాట్‌కు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, ఆకుల అలంకరణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

టెంకాయల విక్రయానికి వేలం

దేవరగట్టులో దసరా బన్ని ఉత్సవాల్లో భక్తులకు టెంకాయాలను విక్రయించేందుకు ఆదివారం క్షేత్రంలో నిర్వహించిన వేలంలో నెరణికి గ్రామానికి చెందిన గాదిగౌడ్ రూ.4 లక్షలకు వేలంలో హక్కులు దక్కించుకున్నాడు. నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం పాటలు జరిగాయి. అక్టోబర్‌లో ప్రారంభమయ్యే బన్ని ఉత్సవాల సందర్భంగా టెంకాయలు అమ్ముకునేందుకు జరిగిన వేలంలో ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. వేలం దక్కించుకున్న వారు ఉత్సవాలు ముగిసే లోపు పాడిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని, ఆ మొత్తాన్ని మూడు గ్రామాల పెద్దల పేరు మీద జాయింట్ అకౌంట్ తెరిచి అందులో జమ చేయాలని నిర్వాహకులు సూచించారు.ఆలూరు సీఐ రాజశేఖర్‌రెడ్డి, హొళగుంద ఎస్ఐ దిలీప్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

20లోపు అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోవాలి

తుగ్గలి : వివిధ కారణాల వల్ల అన్నదాత సుఖీభవ నగదు జమకాని రైతుల కోసం రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ మాడ్యూల్ అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయశాఖ మండల అధికారి సురేష్‌బాబు తెలిపారు. ఈ మాడ్యూల్ 20వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవకు అర్హులై ఉండి, లబ్ధి పొందని రైతులు గడువు లోపు రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమ గ్రీవెన్స్‌ను మాడ్యూల్‌లో పొందుపరిచి తగిన పరిష్కారం పొందాలని ఆయన సూచించారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి





పత్తి కాయమీద ఏర్పడిన నల్లమచ్చలు, పత్తి పంటలో మొగ్గలు రాలిన దృశ్యం

గోనెగండ్ల : ప్రస్తుతం కురిసిన వర్షాలకు పత్తి పంటలో మొగ్గ, పూత, పిందె రాలడాన్ని గమనించినట్లు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. దీనిని నివారించడానికి రైతులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం మండల కేంద్రం గోనెగండ్లలో పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో మొగ్గ, పూత, పిందె రాలి పోకుండా ఉండడానికి ముందుగా పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. తర్వాత ప్లానోఫిక్స్ 1 మిల్లీ లీటర్ 5 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలని చెప్పారు. అలాగే కాయలపై మచ్చలు ఏర్పడి, పెద్దవిగా మారి కాయలు కుళ్లిపోయే అవకాశం ఉందన్నారు. కాయకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 0.1 గ్రాము లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వలన పత్తి పంటలో మొగ్గ, పూత, పిందె రాలడం నివారించవచ్చన్నారు.

చిన్నపాటి వానకే రోడ్లు ఛిద్రం



నందవరంలో గుంతల మయంగా మారిన ప్రధాన రహదారి

నందవరం : మండలంలో రోడ్లన్నీ చిన్నపాటి వర్షానికే ఛిద్రమవుతున్నాయి. రోడ్లు గుంతల మయంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి అందులో వాన నీరు నిల్వ ఉంటుండటంతో వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోక సమయంలో గుంతలలోనీరు చిట్లి పక్కన వెళ్లే పాదచారులపై పడుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించకుండా నాసిరకంగా మరమ్మతు చేపట్టింది. దీంతో కొద్ది పాటి వర్షాలకే మళ్లీ గుంతలను తలపిస్తున్నాయి. గతేడాదిలో రూ.15 లక్షలతో మరమ్మతు చేపట్టిన కూడా నాణ్యతకు తిలోదాకాలతో పనులు చేశారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి ముగతి నుంచి నాగలదిన్నెకు వెళ్లే ప్రధాన రహదారి నాణ్యతతో కూడిన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.